www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 20 జూన్ 2023

5

ఏలూరు

నిర్వాసితులకు పోస్టల్ అకౌంట్‌లు ఇవ్వాలి

జీలుగుమిల్లి : నిర్వాసితులకు అకౌంట్ సదుపాయం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కారం దుర్గ కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన సిరివాక కొండ రెడ్డి గిరిజనులు జీలుగుమిల్లి మండలంలోని దర్భగూడెం పంచాయతీ పరిధిలో పునరావాసం గ్రామంలో గత కొన్ని నెలలుగా నివాసం ఉంటున్నా రన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనుల నిమిత్తం పోస్టల్ అకౌంట్ ఇవ్వాలని పోస్ట్‌మెన్ చుట్టూ అనేకమార్లు తిరిగినప్పటికీ అకౌంట్ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. దర్భగూడెం పంచాయతీలో పలువురు పోస్టల్ ఎకౌంట్లు ఇవ్వాలని అడిగగా గ్రామాల వాళ్లకు పని పాట లేదని, సిరివాక గ్రామానికి సంబంధించిన అకౌంట్ ఇవ్వబో మని చెప్పారన్నారు. దర్భగూడెం పోస్టుమాస్టర్ దుర్మార్గంగా నిర్వాసితుల పట్ల దురుసుగా వ్యవహరించడం సరికాదని, ఈ విషయంపై జీలుగుమిల్లి తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని, జిల్లా ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాసులు ఇచ్చుకో.. చెరువులు తవ్వుకో..!

పేదల భూముల్లో అక్రమంగా తవ్వకాలు

లీజు పేరుతో రెచ్చిపోతున్న పెత్తందారులు

నివాసాల మధ్యే తవ్వకాలు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

దళితుల నివాస ప్రాంతాలను అనుకుని ఉన్న సారవంతమైన, రెండు పంటలు పండే భూములను ఆక్వా చెరువులుగా మార్చేందుకు పెత్తందారులు పనులు వేగవంతం చేస్తున్నారు. దళిత ప్రాంతాలను ఆక్వా చెరువులుగా మార్చి లక్షలాది రూపాయల ఆర్జనే ధ్యేయంగా బడాబాబులు దళిత ప్రాంతాలపై కన్నేశారు. సారవంతమైన వ్యవసాయ భూములను ఏడాదికి ఎకరాకు రూ.40 వేలు చొప్పున లీజుకు తీసుకుని తవ్వేందుకు ఒప్పందం కుదుర్చుకుని తవ్వకాలు చేపడుతున్నారు. ఈ భూముల్లో కుంట, సెంటు ఉన్న కొంతమంది దళిత రైతులున్నారు. 'చెరువులు తవ్వుతున్నాం, మీ భూములు కూడా మాకు లీజుకు ఇవ్వండి' అంటూ బడబాబులు వారిపై ఒత్తిడి చేయడంతో భయపడి చేసేదిలేక సూమారు ఏడు ఎకరాల భూములు లీజుకు ఇచ్చేశారు. తమ ఇళ్లను అనుకుని చెరువుల తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతాయని, వ్యవసాయ భూములు కనుమరుగుతో జీవనోపాధి కోల్పోవడమే కాక తాము గ్రామం విడచి వలసలు పోవాల్సివస్తోందటూ సూమారు 400 మంది జనాభా ఉన్న చినగొన్నూరు, పురిటిపాడు గ్రామాల దళితులు, సరిహద్దు రైతులు జిల్లా కలెక్టర్‌కు, మత్స్యశాఖ, మండల రెవెన్యూ అధికారులకు విన్నవించారు. ఆక్వా చెరువుల కారణంగా భవిష్యత్తు తరాలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందంటూ రెండు గ్రామాల నివాసితులు అంటున్న ఆక్వా చెరువుల తవ్వకాలు మాత్రం నాలుగు పొక్లెయిన్లతో యథావిధిగా కొనసాగడం గమనార్హం. 'ప్రభుత్వం మనది.. అధికారులు మనవాళ్లు, మనల్ని ఏమి చేస్తారు.. మనకు ఎదురే లేదు' అంటూ అధికారపార్టీ నాయకులు బరితెగించి దర్జాగా తవ్వకం పనులు సాగిస్తున్నారు. ఈ విషయమై దళితులు తవ్వకాలు ఆపాలంటూ ఆ భూమిరైతు, పురిటిపాడు గ్రామ ఉపసర్పంచి అనగాని రంగారావును ప్రశ్నించగా 'ఎవ్వరికి ఇవ్వాల్సినవి వారికి ఇచ్చాను, ఎవ్వరూ చెరువు తవ్వకాలను ఆపలేరు' అంటూ సమాధానం చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న చెరువుల తవ్వకాలు నిలుపుదల చేయాలంటూ దళితులు ప్రభుత్వాధికారులను డిమాండ్ చేస్తున్నారు.

చెరువు తవ్వుతున్న పొక్లెయిన్

డబ్బు, మద్యం ఎరచూపి

వి.వసంతరావు, పురిటిపాడు

బడాబాబులు దళితుల్లో కొంతమంది వ్యక్తులకు డబ్బు, మద్యం ఎరచూపి వారి వైపు తిప్పుకున్నారు. చెరువు తవ్వకాల పనులు చేసేందుకు పనికి పెట్టుకుని రోజుకు కూలీ రూ.వెయ్యి ఇస్తూ, విందు, మందుతో వారిని పోషిస్తున్నారు.

చెరువులతో భయం భయం

గద్దె మణిరాజు, చినగొన్నూరు

మేమంతా కూలీ, నాలీ చేసుకుని జీవించేవాళ్లం. పిల్లలను ఇంటి దగ్గర ఉంచి పనులకు వెళ్లాలి. ఇళ్లను అనుకుని చెరువు తవ్వకాలు చేస్తే ఆడుకుంటూ చెరువు గట్టు ఎక్కి చెరువులో పడి మృతి చెందే అవకాశాలున్నాయి. గతంలో ఇలా జరిగిన సంఘటనలున్నాయి. 60 ఎకరాల్లో ఏక చెరువు తవ్వుతున్నారు. భయంగా ఉంది.

చెరువు తవ్వకాలకు ఉపసర్పంచే ప్రేరణ

వేముల వందు, పురిటిపాడు

రెండు గ్రామాల దళితుల నివాసాలను అనుకుని ఆక్వా చెరువుల తవ్వకానికి అసలు కారణం పురిటిపాడు గ్రామ ఉపసర్పంచి అనగాని రంగారావు. ఆయన స్వార్థంతో తవ్వుతున్న చెరువుల వల్ల మేము గ్రామాలను విడచి వేరే ప్రాంతాలకు వెళ్లి పోవాల్సిన దుస్థితి. గ్రామప్రజల క్షేమాన్ని చూడాల్సిన వ్యక్తి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

34 ఎకరాల్లో మాత్రమే తవ్వకాలు జరుగుతున్నాయి

రామసుబ్బయ్య, వీఆర్‌ఓ

దేవరం ఆయకట్టు పరిధిలో ఆక్వాచెరువు తవ్వకాలు 34 ఎకరాల్లో మాత్రమే జరుగుతున్నాయి. మిగిలిన 22 ఎకరాల్లో తవ్వకాలు చేయడం లేదు. వీటికి అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ రైతులు కోర్టుకు వెళ్లారు. ఈ నెల 20న తీర్పు వస్తుంది. అప్పటి వరకూ దళితుల నివాసాల వైపు తవ్వకాలు చేసేదిలేదు.

ఇళ్లకు ప్రమాదమే

ఉచ్చుల డాక్టర్‌బాబు, చినగొన్నూరు

చెరువుల ఏర్పాటుతో ఇళ్లల్లోకి నీరు చేరుతుంది. మరుగుదొడ్లు,సెప్టిక్ ట్యాంకులు త్వరగా నిండిపోతాయి. పంట బోదెలోకి కలుషిత నీరు వస్తుంది. ఇళ్ల చుట్టూ చెరువుల తవ్వకాల వల్ల గ్రామం దీవ్వపంగా ఏర్పడే అవకాశం ఉంది. వ్యాధులు ముప్పేట దాడి చేసే ప్రమాదం ఉంది.

అనుమతులు రద్దు చేయాలి

బేతపూడి గాబ్రియేల్, చినగొన్నూరు

చెరువుల తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను కలెక్టర్ వెంటనే రద్దు చేయాలి. రెవెన్యూ, వ్యవసాయ, మత్స్య, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు చెరువుల తవ్వకాల గురించి ముందస్తుగా మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదు. వెంటనే తవ్వకాలు నిలుపుదల చేసి అనుమతులు రద్దు చేయాలి.

తాగునీరు కలుషితం

వేముల చంటిబాబు పురిటిపాడు

ఆక్వాసాగు బడాబాబులకు ఆదాయాన్ని ఇస్తున్నా, మా రెండు గ్రామాల ప్రజలకు మాత్రం ఆనారోగ్యాన్ని, వాతావరణ కాలుష్యాన్ని తెచ్చిపెడుతోంది. చెరువుల మురుగు పంట కాలువల్లో చేరుతోంది. ఈ నీరు తాగునీటి చెరువులకు చేరి నీరు కలుషితం కావడంతో గ్రామస్తులు అనారోగ్యం పాలవుతారు.

మాలో మాకే గొడవలు పెడుతున్నారు

గద్దె సునీల్, చినగొన్నూరు

చెరువుల తవ్వకందారులు మాలో మాకే గొడవలు పెడుతున్నారు. ఇంటిలో ఇద్దరు అన్నదమ్ములుంటే వారిలో ఒకరిని వారి వైపు లాక్కుని చెరువులు తవ్వేందుకు అనుకూలంగా వారిచేత మాట్లాడిస్తున్నారు. దీంతో అన్నయ్య చెరువులకు అనుకూలంగా కాగా, తమ్ముడు మాత్రం తవ్వకాలను వ్యతిరేకిస్తున్నాడు. దీంతో కుటుంబసభ్యుల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. కుటుంబ సభ్యులను రెండుగా విభజిస్తున్నారు.

మహాధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

సహకార సంఘాల నిర్వీర్యానికి కుట్ర

అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య

డిసిసిబి వద్ద ఉమ్మడి పశ్చిమ జిల్లా కమిటీ ఆధ్వర్యాన సొసైటీ ఉద్యోగుల మహాధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను విడనాడకపోతే ఉద్యోగులలంతా సంఘటితంగా ప్రతిఘటిస్తామని రాష్ట్ర అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు తోట వెంకట్రామయ్య హెచ్చరించారు. సోమవారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వద్ద ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సొసైటీ ఉద్యోగులు మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి వందలాది మంది ఉద్యోగులు హాజరయ్యారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎసిఎస్‌లలో రైతు భరోసా కేంద్రాల విలీనాన్ని నిలిపివేయాలని, పిఎసిఎస్‌లలో 50 శాతం వాటాను ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచన ఉపసంహరించుకోవాలని, వేతన సవరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన వెంకటరామయ్య మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను నిర్వీర్యం చేసేలా జగన్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. సహకార సంఘాల్లో 50శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సహకార సంఘాలను పటిష్టం చేస్తామని వాగ్దానం చేసిన సిఎం జగన్ ప్రస్తుతం సహకార సంఘాలనే ప్రయివేటుపరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చట్ట సవరణ ప్రకారం 50 శాతం షేర్లను బయట వ్యక్తులకు, సంస్థలకు అమ్మే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, చట్ట సవరణను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అదే చట్టసవరణలో రైతు భరోసా కేంద్రాలను సహకార సంఘాల్లో విలీనంపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిఒ 36, 90 ప్రకారం వేతనాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీని గ్రాడ్యుటీ చట్ట ప్రకారం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఆర్ పాలసీలో లోటుపాట్లు సరిచేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ ఉద్యోగుల వేతన సవరణను డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక కమిటీ ద్వారా ప్రతీ ఐదేళ్లకు ఒకసారి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పి.విజయభాస్కర్, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు మాట్లాడుతూ పిఎసిఎస్‌ను ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు అమ్మచూపే ప్రయత్నాలు విరమించాలని డిమాండ్ చేశారు. జిఒ 36 ప్రకారం వేతనాలను ఇతర బెనిఫిట్లను వెంటనే అమలు చేయాలని కోరారు. 2019 నుండి కొత్త వేతన సవరణ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. డిసిసిబి వెనక్కి కట్టించుకున్న ఆరుశాతం వడ్డీ రాయితీ వెంటనే సర్దుబాటు చేయాలని, 2010-11 నుండి నేటి వరకూ 13 సంవత్సరాల క్రితం సహకార సంఘాల ధనంపై రావాల్సిన ఆరు శాతం డివిడెంట్ లేదా వడ్డీ వెంటనే చెల్లించాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డిజిఎంకు వినతిని అందించారు. ఈ ధర్నాకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. యూనియన్ నాయకులు పికె.కృష్ణశాస్త్రి, ఎం.పెద్దిరాజు, పివి.నరసింహరాజు, పి.శ్రీనివాస రావు, సోని, పి.సుబ్బారావు, జి.వీరయ్య, వై.సర్వేశ్వర రావు, భీమేశ్వరరావు, నాయకత్వం వహించారు.

'ఉపాధి' కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

పని ప్రదేశాల్లో వ్యకాస బృందం పర్యటన

ప్రజాశక్తి - పెదపాడు

కూలీల సమస్యలు తెలుసుకుంటున్న పి.రామకృష్ణ

ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. మండలంలోని నాయుడుగూడెం, సత్యవోలు, కొత్తూరు, సత్యనారాయణపురం తదితర గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పి.రామకష్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకానికి ఉరితాడు బిగిసిందన్నారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటోస్ సిస్టం తీసుకొచ్చి కచ్చితంగా రెండు రకాల ఫొటోలు తీయాలని మేట్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. వెబ్‌సైట్ సరిగా పని చేయకపోయినా ఆన్‌లైన్‌లో మస్తర్ పడకపోయినా కూలీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ మొబైల్ మోనిటరింగ్ ఫొటో సిస్టం ద్వారా పేదలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. దీనివల్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, సైట్ సూపర్‌వైజర్లు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఈ జిల్లాలో అనేక మండలాల్లో కూలీలకు పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తాగునీరు, మజ్జిగ కూలీలు తెచ్చుకుంటున్నారని తెలిపారు. మెడికల్ కిట్లు, టెంట్లు వంటి సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల 43 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. నాణ్యమైన పని చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో మండల ఉపాధి సిబ్బంది వైఫల్యం చెందారని విమర్శించారు. ఇప్పటికే ఐదేళ్ల నుంచి పనిముట్లు ఇవ్వకుండా ఆపేశారని వీటికి తోడు మోడీ సమ్మర్ అలవెన్స్, మేట్లకు పారితోషకం, రవాణా ఛార్జీలు, పే స్లిప్పులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. పెదపాడు మండలంలో నాలుగు వారాల నుండి కూలీ డబ్బులు పడక నానా అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. వేతనాలు ఇచ్చే విషయంలో కూడా బిజెపి ప్రభుత్వం అనేక అవకతవకలు చేస్తుందన్నారు. మండల స్థాయి ఎపిఒలు, ఎంపిడిఒల కనుసన్నల్లోనే కొన్ని గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో మట్టి అక్రమ రవాణా కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, కరిముల్లా, సునీత పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

మహా పాదయాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - వేలేరుపాడు

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో మహా పాదయాత్ర ఈ నెల 20వ తేదీ నుంచి జులై నాలుగో తేదీ వరకు నెల్లిపాక నుంచి విజయవాడ వరకు జరుగుతుందని, ఈ మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ధర్మాల రమేష్ కోరారు. ఈ మేరకు వసంతవాడ గ్రామంలో పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర వాల్‌పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ 15 రోజులు పాటు సుమారు 400 కిలోమీటర్లు పైగా సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్నారన్నారు. వేలేరుపాడు మండలానికి 26వ తేదీన మధ్యాహ్నం రుద్రంకోటకు ఈ యాత్ర చేరుకుంటుందని ఆయన తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలని, గోదావరి వరదల నుంచి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. గతేడాది వరదల్లో నష్టపోయిన వారందరికీ పూర్తి స్థాయి పరిహారం చెలించాలని, 1986, 2022 సంవత్సరాల్లో గోదావరి వరదల్లో మునిగిన గ్రామాలన్నిటిని మొదటి దపా పరిహారంలో చేర్చాలని, మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి జరిగే యాత్రలో మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి మద్దతు తెలిపి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం వెంకట్రావు, కొత్త వెంకటేశ్వర్లు, కరటం ప్రకాష్, మడకం బుచ్చయ్య, రాంబాబు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. సోమవారం గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేసి స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లావణ్య వేణికి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని జెసి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఆర్బిట్రేషన్‌లో పరిహారం పెంచి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చింతలపూడి మండలానికి సంబంధించిన కొన్ని గ్రామాల రైతులకు మాత్రమే ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్ ఇచ్చారన్నారు. ఇంకాచాలా పిటిషన్లపై ఇవ్వాల్సిన జడ్జిమెంట్ పెండింగ్‌లో ఉందని, ఆర్బిట్రేషన్ పిటిషన్లు దాఖలు చేసుకున్న రైతులకు పరిహారం పెంచేలా జడ్జిమెంట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే యాక్సిస్ కంట్రోల్ రోడ్ అయినందున సర్వీస్ రోడ్‌ల అవసరం ఉందని, కానీ ప్రాజెక్ట్‌కు సర్వీస్ రోడ్‌లు లేవని, రైతులకు మిగులు భూములకు రాకపోకలకు అసౌకర్యం కలగకుండా రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ రోడ్ వేయించి వాటి నిర్వహణ మొత్తం రోడ్ వేసిన కాంట్రాక్టర్‌తో చేయిస్తామని చెప్పారని, అయితే ప్రస్తుతం సర్వీస్ రోడ్లకు అవకాశాలు లేకుండా హైవే పనులు జరుగుతున్నాయన్నారు. అధికారికంగా సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని డిమాండ్ చేశారు. హైవే నిర్మాణం జరిగే సమయానికి భూముల్లో ఉన్న పంటలను నమోదు చేస్తామని, పరిహారం ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మోసం చేయడం తగదన్నారు. రోడ్ నిర్మాణం చేసేసమయానికి రైతులు సాగు చేస్తున్న చెరకు, పచ్చిమిర్చి, వరి, వర్జీనియా పొగాకు రైతుల పంటలను దున్ని రోడ్డు పనులు నిర్వహిస్తున్నారని, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఉన్న రెవెన్యూ గ్రామాల్లో కొలతలు తప్పుగా జరిగాయాని, ఇచ్చిన హామీ మేరకు కొలతలు జరిపి తప్పులు సరిచేయాలన్నారు. రైతుల భూములు రెండుగా విడిపోయి, నీటి సమస్య ఉన్న రైతులకు (జల కళ)లో బోర్లు వేయిస్తామని చెప్పి ఐదు మంది రైతులకు కూడా ఇంతవరకూ బోర్లు వెయ్యలేదన్నారు. రైతులు మిగులు భూములలో పంటలు పండించుకునే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారని, బోర్లు వెంటనే వేయించాలని, బోర్లు వేసిన రైతులకు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. సొంతభూమి ఐదు ఎకరాలు దాటిన రైతులకు జలకళ బోర్లు లబ్ధిదారులుగా ఆన్‌లైన్ కావడం లేదని, ఫలితంగా ఐదు ఎకరాలు దాటిన రైతులకు జలకళ పథకంలో బోర్లు వేసేందుకు ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. బోరు ఒకవైపు భూమి మరొకవైపు ఉన్నచోట్ల హైవే రోడ్డు కింద నుండి పైప్ లైన్లు వేయాలని కోరారు. హైవే రోడ్ నిర్మాణం వల్ల రైతుల పంటలపై విపరీతమైన దుమ్ము, ధూళి పడి పంటలకు జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొట్టు కనకనరసింహారావు, పుసులూరి శ్రీహరి, గూడపాటి శ్రీనివాసరావు, మంచాల సుబ్బారావు, సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

జెసికి వినతిని అందిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధర్నాలో కడుపు కన్నయ, పిచ్చుక ఆదిశేషు

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఎపి చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కడుపు కన్నయ్య, జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో చేనేత రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేల కోట్లు బడ్జెట్‌లో చేనేత రంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేతకు 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని (మగ్గంతో నిమిత్తం లేకుండా) ప్రతి చేనేత కార్మికుడికి వర్తింపజేయాలని కోరారు. చేనేతపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని, మాస్టర్ వీవర్స్ వద్ద, చేనేత సొసైటీల వద్ద నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కన్నయ్య, ఆదిశేషు డిమాండ్ చేశారు. విద్యా సంస్థలతో సహా అన్ని ప్రభుత్వ సంస్థల్లో చేనేత వస్త్రాలనే వినియోగించాలని, నూలు, పట్టు, జరీ, రంగులు, రసాయనాల ధరలు 2021 నాటి స్థాయికి తగ్గించాలని, చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇల్లు, షెడ్డు నిర్మించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. చేనేత షెడ్లు పైన ప్రభుత్వ వసూలు చేస్తున్న కమర్షియల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని, చేనేత కులాల వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో చేనేత సొసైటీ మాజీ అధ్యక్షులు రొబ్బి రామలింగేశ్వరరావు, గంజి కోటేశ్వరరావు, కొప్పుల శివకుమార్, యర్రా వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, పెంటయ్య పాల్గొన్నారు.

దోసపాడు దళితులకు న్యాయం చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దోసపాడు పేదలు, దళితులు గతేడాది నుంచి వారి భూముల కోసం మొక్కవోని దీక్షతో పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకష్ణ విమర్శించారు. దోసపాడు పేదలందరూ భూమి మాదే, పంట మాదే, హక్కులు మాకే దక్కాలంటూ నినాదాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గతేడాది క్రితం ప్రారంభమైన దోసపాడు భూ పోరాటం పేదలు, దళితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాటంలో పేదలు, దళితులు పలుమార్లు మండల రెవెన్యూ శాఖ అధికారులు, జిల్లా అధికారులను కలిసి వారి గోడు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోలేదన్నారు. పేదల హక్కులను కాలరాస్తూ, దళితుల చట్టాలను నీరుగారుస్తూ పేదలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ దృష్టిలో ఉన్న ఈ సమస్యను, రెవెన్యూ అధికారులు పరిష్కరించడంలో వైఫల్యం చెందారన్నారు. దోసపాడు పేదలకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1965, 74 సంవత్సరాల్లో గత దఫాలుగా పేదలకు ప్రభుత్వాలు పట్టాలు పాస్ బుక్స్ మంజూరు చేశారని తెలిపారు. ఆ రికార్డులు జిల్లా రెవెన్యూ శాఖ అధికారుల ఆధీనంలో ఉన్నాయన్నారు. ఈ రికార్డులు తారుమారు చేసిన రెవెన్యూ శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు కట్టి ఏడు నెలలు దాటినా నేటికీ ఆ కేసులో ఉన్న నిందితులను అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దోసపాడు దళితులకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో 144, 145 సెక్షన్లు ఎత్తివేసి పేదలకు రక్షణ కల్పించాలన్నారు. ఎవరైతే భూములు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారో వారిపై అసైన్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 4 ప్రకారం అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్.జాన్‌రాజు, నాగేంద్ర, పవన్, మణి, బేబీ, మాణిక్యం, దుర్గ, శ్రీను, ఏసుమని, హేమలత పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దోసపాడు దళితులు

ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అధిక ఫీజులు నియంత్రించాలి

ఆర్‌డిఒకు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ప్రజా సంఘాల సంయుక్తంగా స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శులు బొడ్డు యశ్వంత్, ఎస్‌కె.సుభానీలు మాట్లాడుతూ పట్టణంలో ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదన్నారు. ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఏడాది ఫీజులు గుంజుతున్నారని వాపోయారు. ప్రభుత్వ నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న స్పందించని విద్యాశాఖాధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రయివేట్ విద్యాసంస్థల్లో తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేయాలని, ఫీజుల వివరాలను తెలియజేస్తూ హోర్డింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సమైక్య జంగారెడ్డిగూడెం కార్యదర్శి వంగ గోపి పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఊర చెరువు నివాసాల్లో దశాబ్దాలుగా మురికి నీరు పోయే మార్గం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ఎంపీ నిధులు రూ.30 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. స్థానిక ఊర చెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో డ్రెయినేజీ సమస్యలు ఉండవని తెలిపారు. సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు చిటికెన అచ్యుతరామయ్య, దొంతు మాధవ్, శంకు సురేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో కీలక పాత్ర పోషించే వాలంటీర్ల మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.వద్యావతిదేవి తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం భీమడోలు గ్రామపంచాయతీ స్థాయిలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.రాగూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయిలో ఉత్తమ వాలంటీర్‌గా ఎంపికైన బందారు ప్రదీప్‌కు సేవా వజ్ర, సేవా మిత్రాలుగా ఎంపికైన మరో 86 మందిని గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్కరించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సునీతమాన్‌సింగ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా భీమడోలు జెడ్‌పిటిసి సభ్యురాలు తుమ్మగుంట భవానిరంగతో పాటు ఎంపిడిఒ సిహెచ్.వద్యావతిదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్, వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు, తుమ్మగుంట రంగా పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పియవిఎస్.మణింద్రరావు తెలిపారు. ఉన్నత విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కొత్తగా నాలుగు సంవత్సరాల కోర్సు ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 24వరకు విద్యార్థుల రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 26వ తేదీ నుంచి 30 వరకు కళాశాల ఎంపిక, జులై 3న సీట్ల కేటాయింపు నాలుగో తేదీ నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం అదనపు అధ్యాపకులతో పాటు ల్యాబ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పియవిఎస్.మణింద్రరావు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.అబ్బులు తెలిపారు.

'టిడిపితోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు'

ప్రజాశక్తి - చాట్రాయి

రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి నవ్యాంధ్రను రుణాంధ్రగా మార్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్‌ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తగూడెం పంచాయతీ ఎర్రవారిగూడెం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చేది ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దేది టిడిపినే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు వెల్ది నాగేశ్వరరావు, వల్లగుట్ల రాజతిర్థం, గ్రామ నాయకులు మద్దివారి శ్రీనివాసరావు, ములగలపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కౌలు కార్డులు పొందాలి

ప్రజాశక్తి - చింతలపూడి

కౌలు రైతులు కౌలు కార్డులు కచ్చితంగా తీసుకోవాలని చింతలపూడి అగ్రికల్చర్ ఎఒ మీనాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌలు కార్డుల నమోదు కోసం వివోఆర్‌ఓలను సంప్రదించాలని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డు తీసుకువెళ్లాలని తెలిపారు. క్రాప్ నమోదు చేయాలంటే కౌలు కార్డు తప్పనిసరని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల దేవస్థానంలో వాహన పూజా పురోహితుడుగా పని చేస్తున్న సాతులూరి శ్రీనివాసాచార్యులు (45) ఆదివారం రాత్రి గుండుగోలను వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం శ్రీనివాసాచార్యులు భార్యతో కలిసి బైక్‌పై ఏలూరు వెళ్లారు. తిరిగి వస్తుండగా సుమారు రాత్రి 11 గంటల సమయంలో గుండుగొలను వద్ద అప్పటికే రోడ్డుపై మృతి చెంది ఉన్న గేదెను ఢీ కొట్టడంతో శ్రీనివాసాచార్యులు కింద పడి తీవ్రగాయాలపాలయ్యారు. తలకు గాయం కావడంతో శ్రీనివాసాచార్యులు మృతి చెందారు. ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన దెందులూరు పోలీసులు తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలికపై అదే గ్రామానికి చెందిన 30 సంవత్సరాల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ సోమవారం కేసు నమోదు చేశారు. పోలవరం డిఎస్‌పి ఎ.శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814



ఫణిప్రసాద్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

జెఇఇలో విద్యావికాస్ విద్యార్థికి ఆలిండియా 561 ర్యాంకు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఐఐటి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో స్థానిక విద్యావికాస్ విద్యాసంస్థల విద్యార్థి ఆలిండియా 561 ర్యాంకు సాధించి సత్తా చూపారని విద్యావికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఐఐటి, జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యావికాస్ విద్యార్థులను సోమవారం వారు అభినందించారు. ఈ సందర్భంగా సతీష్ చంద్, శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యావికాస్‌కు చెందిన విద్యార్థి కొల్ల జస్వంత్ ఫణి ప్రసాద్ ఓపెన్ క్యాటగిరిలో ఆలిండియా 561 ర్యాంకు సాధించారని తెలిపారు. కె.జాన్ దేవదాస్ ఆలిండియా 5008 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అపారమైన విజ్ఞానం అనుభవం కలిగిన, ఉపాధ్యాయ, అధ్యాపకులతో శిక్షణ కల్పించడంతో విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాలను నిలబెట్టి ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ విద్యావికాస్ విద్యా సంస్థలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు ఎంఇఒ-2గా కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని రాష్ట్ర విద్యాశాఖ అన్ని మండలాల్లో రెండో విద్యాశాఖాధికారి పోస్టులను కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేసింది. ఉంగుటూరు మండల రెండో విద్యాశాఖాధికారిగా జీలకర్రగూడెం ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

మొదట విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణ రెండో విద్యాశాఖాధికారిగా కె.శ్రీనివాసరావును జాయిన్ చేసుకున్నారు. వారికి మండల విద్యాకార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు రూరల్ ఎంఇఒ-2గా రంగయ్య

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు రూరల్ మండల విద్యాశాఖాధికారిగా ఆర్.రంగయ్య సోమ వారం ఏలూరు ఎంఇఒ కార్యాలయంలో బా ధ్యతలు స్వీకరించారు. పోతునూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ ఎంఇఒ-2గా ఉద్యోగోన్నతి పొందినట్లు ఆయన తెలిపారు.

గతంలో జంగారెడ్డిగూడెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో తొమ్మిదేళ్లు పని చేసినట్లు తెలిపారు. ఎంఇఒ-2 గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.రంగయ్యకు సిఆర్‌పిలు దివ్య, సునీత, సంధ్య, కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మి, అటెండర్ ఖాన్‌లు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ ఎంఇఒగా పనిచేస్తున్న నరసింహమూర్తి పెడపాడు ఎఇఒగా కొనసాగనున్నారు. ఏలూరు రూరల్ ఎంఇఒ-1 పోస్టు భర్తీ కానీ నేపథ్యంలో అప్పటివరకు ఎంఇఒ-1గా బాధ్యతలు నిర్వహిస్తారని సమాచారం.

మండవల్లి ఎంఇఒ-2గా రత్నసునాదం

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి మండలానికి విద్యాశాఖాధికారి-2 గా శీలం రత్నసునాదం సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గంపలగూడెం మండలం ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రత్నసునాదంకు మండవల్లి మండల విద్యాశాఖ

అధికారి-2గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సోమవారం బాధ్యతలు చేపట్టారు. విద్యాశాఖాధికారి-1గా కె.నరేష్‌కుమార్ ఉన్నారు.

హుండీ ఆదాయం రూ.79,814

ప్రజాశక్తి - ముసునూరు

బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం సోమవారం ఆలయాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. గత ఫిబ్రవరి నెలలో ఉత్సవాల అనంతరం నుంచి నేటి వరకు 115 రోజులకు ఆలయ హుండీలు లెక్కించగా రూ.79,814 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ భూములు అధికారులు, గ్రామస్తుల సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించగా, వేల్పుచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో ఆర్‌ఎస్ నెంబర్ 376లో య.1.16 ఎకరాల భూమికి సంవత్సరానికి రూ.23 వేల ఆదాయం వచ్చిందన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే రూ.8500 అధిక ఆదాయం వచ్చినట్లు తెలిపారు. బలివే రెవెన్యూ గ్రామ పరిధిలో ఆర్‌ఎస్ నెంబర్ 118లో య.8.78 ఎకరాల భూమికి కౌలు వ్యవసాయం కోసం ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ ఇఒ తెలిపారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

చింతలపూడి :ప్రగడవరం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని సర్పంచి భూపతి అన్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ దేశవరం గ్రామంలో ఎంపీ శ్రీధర్ బాబు నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు స్థానిక ఎంపిటిసి సభ్యులు నాగలక్ష్మి రమేష్, భూపతి ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు.

కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు తప్పనిసరి

జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు తప్పనిసరి అని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందన సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు అందిస్తుందని, దీని ద్వారా కౌలు రైతులకు ధాన్యం కొనుగోలు, పంట రుణం, పంట బీమా, ఇన్ పుట్ సబ్సీడీ, పంటనష్టం వంటి పథకాలను కౌలు రైతు పొందవచ్చని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని ప్రతి మండలంలో కౌలు రైతులకు సాగుహక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని, మండల వ్యవసాయ అధికారులు పంపిణీ పర్యవేక్షించాలని వ్యవసాయశాఖ అధికారులను జెసి ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందనలో అందిన ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అర్జీలను ప్రతి సోమవారం మండలస్థాయి కమిటీ ఆడిట్ చేసి జిల్లా ప్రధాన ఆడిట్ కమిటీకి నివేదికను అందించాలని తెలిపారు. స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారంలో ఫొటో, ఎండార్స్ మెంట్, అర్జీదారుడి సంతకంతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 314 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని వినతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంతో పాటు, మెడికల్ షాపుల యజమానుల దోపిడీలను అరికట్టాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, రేషన్ దుకాణాల ద్వారా పది రకాల నిత్యావసర సరుకులను సరఫరా చేయాలని, రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రాయితీపై అందించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లను అమర్చవద్దని, కనీస విద్యార్హత లేకుండా వైద్యం చేస్తూ అధిక ధరలకు మందులు విక్రయిస్తున్న మెడికల్ షాప్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, షేక్ జహంగీర్ బాషా, జలసూత్రం గోపాలరావు, షేక్ సుభాని, రెడ్డి బాబురావు పాల్గొన్నారు.

గ్రామసభలు పారదర్శకంగా నిర్వహించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

వికేంద్రీకృత ప్రజాస్వామ్య వ్యవస్థకు గ్రామసభలు పునాది వంటివి అని, గ్రామ సభల్లో అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. జులై ఒకటి నుంచి జరగనున్న గ్రామసభలను విజయవంతంగా నిర్వహించేలా చూడాలని కోరుతూ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపిడిఒ టికె.రమణ, తహశీల్దార్ కె.రాజకుమార్‌లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్య పద్ధతిలో అట్టడుగు స్థాయి నుంచి ప్రణాళికల రూపకల్పనకు గ్రామసభ ఒక చక్కని సాధనమన్నారు. గ్రామ సభలను తూతూ మంత్రంగా నిర్వహించడం సమస్యలు పరిష్కారం కాకపోవడం పెద్ద సంఖ్యలో అధికారులు పాల్గొనకపోవడం వల్ల ప్రజలు గ్రామసభకు వచ్చేందుకు ఇష్టపడడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో గ్రామసభలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, మండలంలో నిర్వహించే గ్రామ సభలకు ఎక్కువమంది అధికారులు హాజరై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు, ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు వరద శ్యామ్, బండి రంగారావు, వీరపనేని ముసలయ్య పాల్గొన్నారు.

27 నుంచి ఎఐవైఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - చింతలపూడి

అఖిలభారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణా తరగతులు ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గుంటూరు నగరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ చాకిరి సురేష్, జిల్లా కో-కన్వీనర్ తుర్లపాటి రాజు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రాన్ని పట్టణంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ యువతను సైద్ధాంతికంగా తయారుచేసి పోరాటాల రూపకల్పనకు ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వినింగ్ కమిటీ మెంబర్ వడ్డే రామారావు, బొల్లవరపు విజయశేఖర్, బలువురు శేఖర్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి మాజీ సభ్యులు తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

అధికారులు సూచించిన విత్తనాలే సాగు చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యవసాయ శాఖాధికారులు సూచించిన విత్తనాలు సాగు చేయడం లాభదాయకమని మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ సీజన్‌లో నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అందించే ఎంటియు 1061, ఎంటియు 7029, ఎంటియు 1224, ఎంటియు 1064, పిఎల్ఎ 1100 రకాల విత్తనాలు సాగు చేయాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎంటియు 1061 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పేద విద్యార్థుల కోసమే 'జగనన్న ఆణిముత్యాలు'

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేద విద్యార్థుల కోసమే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం అని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని గురజ, ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్స్‌లో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదోతరగతి 2023లో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, గ్రామ ఎంపిటిసి సభ్యులు జంపాన కోటయ్య, వైస్ ఎంపిపి రాచూరి రాధ, వైసిపి నేతలు ఈడే వెంకటేశ్వరరావు, ఎంఇఒ రామారావు, పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ పుట్ల సుమ పాల్గొన్నారు.

భీమడోలు : మామూలేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గుండుగొలను)స్థాయిలో పదో తరగతి ఆణిముత్యాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జికెడి.సునీత ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో వరుస క్రమంలో అత్యధిక మార్కులు సాధించిన ఇవి.సాయి, ఎం.తన్మయ, వివి.సాయిలను పాఠశాల యాజమాన్యం తరపున వైసిపి గుండుగొలను సచివాలయాల కన్వీనర్ గొటికల మురళీ, పార్టీ గ్రామ కార్యదర్శి ఎన్.శ్రీను, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు జి.మాధవ్ సత్కరించారు.

పోలవరం : గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కెవి.రాఘవన్ అధ్యక్షతన సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కమిటీ ఛైర్మన్ వీరపరాజు సత్యనారాయణ, గర్రె రామచంద్రం, సారిక అనిత హాజరయ్యారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెడల్స్, క్యాష్‌ప్రైస్ ప్రదానము చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ మెంబర్లు, తలిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో సోమవారం జగనన్న ఆణిముత్యాల పేరిట బ్రిలియన్స్ అవార్డులు పంపిణీ చేశారు. కైకరం జెడ్‌పి హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు అవార్డులు అందించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ప్రిన్సిపాల్స్‌లను శాలువ మెమెంటోతో సత్కరించారు.

వీధిదీపాలు వెలిగించండి మహాప్రభో..!

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రు పంచాయతీ శివారు కొత్తపల్లి దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రం వీధిలో గత మూడు నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదని గ్రామ వైసిపి నాయకులు దాకరపు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ గ్రామ అంగన్‌వాడీ బజారులో వీధిలైట్లు పాడై మూడు నెలలు గడుస్తున్నా నేటికి మరమ్మతులు చేపట్టలేదన్నారు. పలుసార్లు ఈ విషయమై గ్రామ కార్యదర్శి జి.రమేష్‌కు విన్నవించినా ఆయన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నివాసాలు పొలాలను ఆనుకుని ఉన్న కారణంగా పాముల సంచారం అధికంగా ఉందన్నారు. రాత్రి సమయాల్లో ఏ విషపురుగు కాటుకు గురవుతామోననే భయం గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కార్యదర్శి స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరుతున్నాడు.

జగనన్న విద్యాకానుక కిట్లు అందజేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని గోపీనాథపట్నంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యాసామగ్రిలను ఆ గ్రామ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ బడుల్లో డ్రాప్ అవుట్ల నివారణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు అభ్యున్నతికి, విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం, పాఠశాల స్థాయిలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు, కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు మాటూరి చక్రధరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి మార్కెట్ కమిటీ ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఎ.సుబ్బారావు, యువ నాయకులు ఏలియా, దిలీప్, దుర్గారావు పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ ఆవరణలో ఈ నెల 22వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్ తెలిపారు. జాబ్‌మేళాలో హనుమాన్ జంక్షన్ కేంద్రంగా పనిచేసే మోహన్ స్పిన్ టెక్స్, హనుమాన్ జంక్షన్ కేంద్రంగా పనిచేసే మ్యాక్స్ సెక్యూరిటీస్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ (ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి పరిధిగా గల) రాజమండ్రి రీజియన్‌లో వివిధ ఖాళీల్లో పని చేయడానికి నిర్ణీత విద్యార్హతతో, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే తోషిబా కంపెనీలో ఐటిఐ విద్యార్హత గల వారు వివిధ ఉద్యోగాలకు కోసం హాజరు కావచ్చని తెలిపారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమడోలు

కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పుట్టినరోడు వేడుకలను భీమడోలులో సోమవారం ఆ పార్టీ ఉంగుటూరు బ్లాక్ అధ్యక్షులు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ వేదికగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ పాతపాటి హరికుమార్‌రాజు పాల్గొని కేక్‌ను కోశారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు అప్పక రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంజేటి విజయ్ అచ్యుతం, వసంతరావు మాస్టారు, దుర్గారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఎపిసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎపిసిసి సభ్యులు, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథ్‌రావు పార్టీ కార్యాలయం వద్ద పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెట్టి గురునాథరావు కేక్ కట్ చేసి శుభాకంక్షలు తెలిపి మాట్లాడారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర ద్వారా దేశవ్యాప్తంగా పర్యటించి ప్రజల స్థితిగతులను పరిశీలించి ప్రజల పక్షాన ప్రజల తరపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు రాహుల్ గాంధీని భారత ప్రధానిగా చూడాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి శ్రీనివాసరావు, మొగిలినీడి శ్యామ్, ప్రగళ్లపాటి కాశి, హీరా హకీమ్, బొరుసు ప్రసాద్, ఏలూరి ఫణికుమార్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KATAM ROSE MARY, W/O. KATAM EMMANUAL, D.NO. 16-2-18/11, WEAVERS COLONY, RUSTUMBADA, NARASA PURAM -534275, W.G.DT. A.P. I HAVE CHANGED MY NAME FROM ROSE MARINE ANTION ETTE AMARA (OLD NAME) TO KATAM ROSE MARY (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRE-SPONDENCE WILL BE COUNTI NUE WITH MY NEW NAME KATAM ROSE MARY

ఒరిజినల్ దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామానికి చెందిన కుప్పాల పాపారావు గారి కుమారుడు కుప్పాల శ్రీనివాసరావు మరియు వారి సోదరుల ఉమ్మడి ఆస్థికి సంబంధించి తాడేపల్లి గ్రామంలోని ఆర్.యస్.నెం. 48లో య.0-72 సెంట్లు భూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు (నెం.29/1986) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చగలరు.

కుప్పాల శ్రీనివాసరావు
తండ్రి: పాపారావు, వడ్లమాను గ్రామం,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 63013 73358

ప్రకటన
మహారాజశ్రీ 2వ అడిషినల్ జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టు
A.S.No. 150/2019

బిట్వీన్:
శ్రీమతి తూతిక లక్ష్మి ...అప్పిలెంటు
మరియు
శ్రీమతి దాసరి కనకరత్నం వగైరా ...రెస్పాండెంట్లు

టు: ఆర్-1:
శ్రీమతి దాసరి కనకరత్నం, భర్త: లేటు బాబూరావు, డో.నెం. 6-224/2, చాటపర్రు రోడ్డు, వెంకటాపురం, ఏలూరు.

పై నెంబరు అప్పీలు పైన ఉదహరించిన 1వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం ది.27-07-2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున 1వ రెస్పాండెంటు వాయిదా రోజుఏ **ది.27-07-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను.** లేని ఎడల 1వ రెస్పాండెంటు పరోక్షంలో అప్పీలు తీర్మానించబడును.

బి.గౌరీశంకర్
శ్రీమతి ఎ.శోభారాణి
అడ్వకేట్స్, పవర్ పేట,
ఏలూరు. సెల్: 74162 36226

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 136-143/GGMP - Mpl. Funds, GGMP-Grant & General/2023-24, Dated. 19-6-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of CC Roads & Drains, Construction of Toilets, Manufacturing Supply and Delivery of Push Carts, Providing of Illumination for Walking Track, Providing New Bore Well and Supply of Man Mazdoor in parks at various places in Municipal Corporation Eluru"** Total No of works is **8** with an amount of Rs. **47.98** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 21-06-2023. Last date of receipt of tenders is 26-06-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax: 08812 - 245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU